కళ్ళు జ్యోతుల్లా ఉన్నాయి. మొహం గాంభీరించి ఉంది మనిషిలో అలసట కనిపిస్తోంది.

"రాత్రి సరిగా నిద్రపట్టలేదా, అన్నయ్యా?" అని అడిగింది. కాఫీకప్పు టీపాయ్ మీద పెట్టి, అతనివైపు భయం భయంగా చూస్తూ.

మూర్తి కాఫీకప్పు చేతిలోకి తీసుకున్నాడు. ఒక్క గుక్కలో కాఫీ అంతా తాగేశాడు. నేప్‌కిన్‌తో పెదిమలు తుడుచుకుంటూ, "ఇంకా రాఘవ రాలేదూ?" అని అడిగాడు.

"రాలేదు." ముభావంగా అన్నది రాధ.

మూర్తి ఒక్క ఉదుటున మంచంమీదనుండి లేచి నిలబడ్డాడు. చెల్లెలి బుజాలమీద చేతులు వేసి, "అమ్మలూ! అమ్మా, నాన్నా నువ్వే నాకు. నిజం చెప్పు. ఏం జరిగింది? ఏం జరిగింది?" అన్నాడు ఆవేశంగా.

రాధ నిశ్చలంగా అతనివైపు చూసింది. "ఏమి టన్నయ్యా ఇది? ఏం జరగలేదు. నీకు నిద్ర సరిపోయినట్టు లేదు. కాసేపు పడుకో మళ్ళీ" అని వెళ్ళిపోయింది.

"కాదు, కాదు. ఏదో జరిగింది. నువ్వు దాస్తున్నావ్. నా దగ్గిర, నీ రక్తం పంచుకున్నవాడి దగ్గిర, నిన్ను పెంచినవాడి దగ్గిర. .రాధా! చెప్పవూ? నిజం చెప్పవూ? ఏం జరిగింది?" అతని కంఠంలో





ప్రాధేయత ధ్వనించింది.

"అన్నయ్యా! నువ్వేదో ఊహించుకుంటున్నావ్? దయవలసిందేముం దిక్కడ? ఆయి పువ్వుల్లో పెట్టి పెంచిన అన్నవు నువ్వు! — ఇయి పువ్వుల్లో పెట్టి పూజించే మీ బావగారు! అంతా వడ్డించిన విస్తరి నాకు."

మూర్తి ఆమెను ఎట్టుకొని అటూ ఇటూ ఊపి వేశాడు. "అయితే నువ్వు రాత్రి నిద్రలో ఎందు కేడ్చావ్! చెంపలమీద ఆ కన్నీటి చారిక లెందు కేర్పడ్డాయి?"

"ఏదో పాడు కల వచ్చి ఉంటుంది. లేచి మంచినీళ్ళు తాగి పడుకుంటే సరిపోయేది. బద్ధకమేసి అట్లాగే పడుకొని నిద్రపోయి ఉంటాను."

ఆ జవాబు విని అప్రతిభుడైన మూర్తి చెల్లెలి వైపు తదేకంగా చూసి, "అయితే ఈ ఉత్తరం సంగ తేమిటి?" అంటూ జేబులో నుండి ఓ ఉత్తరం తీసి ఆమెచేతి కందించాడు. ఆ ఉత్తరం చదువుతున్నంత సేపూ ఆమె మొహంలో మారుతున్న రంగులు ఏకదీక్షగా గమనించాడు.

"మూర్తీ! వీలు చేసుకుని ఒకసారి రా." ఉత్తరం చదువుతూ, చదువుతూ ఆమె అన్నవేపు బేలగా చూసింది.

"ఒక విషయంలో నీ సలహా కావాలి. ఆలస్యం చేశావో అనుకోని పరిణామాలు సంభవిస్తాయి. చేతులు కాలిన తరవాత, ఈ విషవలయంలో నేను చిక్కుకున్న తరవాత ఎవర్ని ఏమనుకునీ ప్రయోజనం లేదు."

ఆ ఉత్తరం ఆమె పూర్తిచెయ్యకుండానే అడిగాడు: "ఏమిటి ఆ విషవలయం? నా సలహా ఎందుకు కావలిసి వచ్చింది? నీకు తెలిసే ఉంటుంది. చెప్పవ్?"

ఉత్తరం చదవడం పూర్తిచేసి, తల వాల్చి, కాసేపు తనలో తా నేదో ఆలోచించుకుంది. అంతవరకూ ఆమె ప్రకటించిన మేకపోతు గాంభీర్యం పేకమేడలా కూలి పోయింది. క్రమక్రమంగా ఆమె కళ్లలో నీళ్ళు నిండాయి. ఒక్కసారిగా ఆమె "అన్నయ్యా!" అంటూ అతనిమీద వాలి, "ఎందుకు ఇంత ఆలస్యం చేశావ్?" అన్నది రుద్ధకంఠంతో.

ఆమె తీగలా కంపించిపోతున్నది. మూర్తి తన చెల్లెల్ని పొదివి పట్టుకుని, అక్కున చేర్చుకుని, జాలిగా ఆమె జుట్టు నవరిస్తూ, "ఏం జరిగిం దమ్మలూ?" అని అడిగాడు.

రాధ తనలో తనుకొంటున్నది. 'ఎట్లా చెప్పను? ఎట్లా చెప్పను?' పిల్లలిద్దరూ లోపలికి రాబోయి గుమ్మం దగ్గిరే ఆగిపోయారు. పిచ్చిక పిల్ల ఒకటి భయపడి బయటకు పారిపోయింది.

"భయంలేదు. చెప్పమ్మా! ఏం జరిగింది?"

"మీ బావగారు . . . బావగారు . . ." రాధ ఆగిపోయింది.

"ఏం చేశారు?"

"మళ్లీ పెళ్లి చేసుకున్నారు."

పిల్లలు గొల్లుమన్నారు. బయట ఎండకూడా నిప్పులు కక్కడం ప్రారంభించింది.

## 2

జులేఖా డ్రెస్సింగ్ టేబిలుముందు కూచుని, తలంటి పోసుకుని జారుముడి వేసుకున్న జడలో మల్లెలు తురుముకుని, సెంటెడ్ శాండల్ పౌడర్‌ను లలితంగా మొహానికి రాసుకుని, మెడలో ఎర్రరాళ్ల నెక్లెస్‌ను అలంకరించుకుని, 'బ్రా'ను సవరించుకుని, తెల్లని తన ఒంటి రంగుకు ఆకుపచ్చ చీరమీద నల్లపూల బోర్డరు సరిపోయిందీ లేనిదీ మరొక్కసారి అద్దంలో చూసుకొని, ఒయ్యారంగా లేచి నిలబడి, బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని, గడియారంవేపు కోపంగా చూసి, గోడవైపుగా తిరిగి, హైహీల్స్‌లో కాళ్ళు పెడుతూ, గుమ్మం దగ్గిరగా చప్పుడవడం విని, "కమిన్! కమిన్! ఏం ఇంతాలస్యం చేశావ్?" అన్నది.

మూర్తి లోపలకు వచ్చాడు.

అడిగిన ప్రశ్నకు సమాధానం లేకపోవడం చూసి, ఉబ్బురపడి జులేఖా వెనక్కి తిరిగి చూసింది. 'ఎవరో ఆగంతుకుడు! అనుమతి అయినా లేకుండా సరాసరి లోపలకు వచ్చేసేడు?' అనుకుంది.

కొంచెంగా కంగారుపడి, "ఎవరు కావాలండీ మీకు?" అన్నది గంభీరంగా.

"మా బావగారు కావాలి."

> **అధికారి**
>
> అధికారివయితే నీ వెళ్ళ కప్పుడు కళ్ళు మూసుకో! సేవకుడవయితే అప్పుడప్పుడు చెవుడు అలవరుచుకో!
>
> — ఫుల్లర్

జులేఖా కళ్ళు చేపల్లా మెరిశాయి. పరిస్థితి అర్థం చేసుకున్న వెలుగు ఆమె మొహంలో [illegible].

"మీ అక్క దగ్గిర లేదా?"

అతను పిడికిళ్ళు బిగించాడు. [illegible]

"[illegible]! ఎవరో దొంగనుకున్నాను..."

"అయితే దొంగను పట్టుకోడానికి వచ్చావనుకున్నాను."

ఆమె నవ్వుతూంది పగలబడి. నవ్వులో ఆమె శరీరం వంపులు తిరుగుతూంది. వంపుల్లో దాగిన ఆమె అందం [illegible].

"పట్టుకోడానికి కాదు, [illegible] చెప్పడానికి వచ్చాను, కోమలాదేవీ!"

"కోమలాదేవి?" ఆమె భ్రుకుటి క్షణమాత్రం ముడివడ్డది. "కాదు. ఇప్పుడు నేను జులేఖాను."

"ఎవరైతే నాకేం? ఊసరవెల్లివి."

కోమలాదేవి ఉరఫ్ జులేఖా అర్థమైనట్టు తల పంకించి, కొంటెగా, "దయచేసి కూచుంటారా?" అంటూ కాలితో కుర్చీని అతని దగ్గిరికి జరిపింది. అతను కూర్చోలేదు. ఆమె తనొక కుర్చీని చేతితో దగ్గిరికి లాక్కున్నది. మహారాజ్ఞి క్లియోపాత్రాలా ఆ కుర్చీలో కూచున్నది. మూర్తి నిలబడే ఉన్నాడు. ఆమె అతని వేపు చూసి చూసి, "ఊఁ! ఇప్పుడు చెప్పండి, ఈ ఊసరవెల్లికి ఏ చెప్పే బుద్ధి?" అంది.

మూర్తి కోపంతో ముందుకు ఓ అడుగు వేసి, మళ్లీ తమాయించుకుని నిలబడ్డాడు. తన ఎదుట ధీమాగా కుర్చీలో కూర్చున్న స్త్రీని అసహనంగా చూస్తూ, "ఎన్ని సంసారా లిట్లా నాశనం చేశావో, నీకు నేనేం బుద్ధి చెప్పగలను?" అన్నాడు అసహ్యంతో, మాటలను ఒత్తిపలుకుతూ.

ఆమె కోపం కళ్లల్లో లీలగా మెరిసి, చెంపల్లో తళుక్కుగా మారి, పెదిమలపై అవహేళన పూరకమైన నవ్వుగా మారింది.

"ఆ మాటే నేను మీ అక్కను గురించి అంటే?"

"దాని పేరెత్తడానికైనా నీకు అర్హత లేదు. అది దేవత. ఉత్తమ ఇల్లాలు. భర్తా, పిల్లలూ, సంసారమూ తప్ప మరో ప్రపంచం తెలీని పుణ్యస్త్రీ. దాని గుండెల్లో నువ్వు మంట రగిల్చావు. మా బావగారి మనసు మార్చావు. ఉద్యోగమూ, ఇల్లూ తప్ప తెలీని ఆ అమాయకుణ్ణి వల్లో వేసుకుని, రెండో పెళ్లి చేసుకుని, ఆయన ప్రతిష్ఠను నాశనంచేసి, ఆయన గవర్నమెంటు ఉద్యోగానికి ప్రమాదం కలగజేసి ..."

జులేఖా తల అడ్డంగా ఆడించింది. "ఉద్యోగానికేం ప్రమాదం లేదు. చట్టసమ్మతంగానే పెళ్లి చేసుకున్నాం."

"ఎట్లా?"

"మతం మార్చుకున్నాం. నా పేరు జులేఖా. ఆయన పేరు ఇస్మాయిల్."

మూర్తి తెల్లబోయాడు. ఆలోచించినకొద్దీ ఆ యువతి తెలివితేటల ముందు తను తేలిపోతున్న విషయం స్పష్టపడసాగింది. నిలబడలేక కుర్చీలో కూలబడ్డాడు. కర్చీఫ్‌తో మొహానికి పట్టిన చెమటను తుడుచుకున్నాడు.

"మా రాఘవ ఇంత భ్రష్టుడయ్యాడా?" అన్నాడు నీరసంగా.

"కాదు, నన్ను రక్షించారు" అన్నది జులేఖా కృతజ్ఞతతో కూడిన కళ్లను సగం మూసి.

"కాదు, మమ్మల్ని సర్వనాశనం చేశాడు. అగ్ని సాక్షిగా పెళ్లాడిన భార్యను కాదని, కడుపున కన్న సంతానాన్ని కాదని, తన కొక అస్తిత్వాన్నిచ్చిన మతాన్ని కాదని... ఛీ! దౌర్భాగ్యుడు! ఇడియట్! స్కౌండ్రల్!"


జులేఖా కంగారుగా కుర్చీలోనుండి లేచి నిలబడింది. "వద్దు, వద్దు. ఆయన్ను తిట్టకండి" అంటూ ప్రాధేయపూర్వకంగా, "ఇందులో అంతా నాదే తప్పు నన్ను తిట్టండి" అన్నది వణుకుతున్న కంఠంతో.


"[illegible] ఏమేముంది? వచ్చిన అవకాశాన్ని [illegible] కొంగున ముడేసుకున్నావ్!" మూర్తి ఉన్నట్లుండి మాట్లాడడం ఆపేశాడు. జేబులో నుండి నోట్ల కట్ట బయటకు తీశాడు. ఆ డబ్బుని ఆమె ముందు గిరవాటు వేశాడు. "ఇందులో పది వేలున్నాయి. ఇంకా కావాలంటే ఇస్తాను. ఈ కాయితం మీద సంతకం పెట్టు" అన్నాడు.

కాళ్లమీద పడ్డ నోట్లకట్టను తీసి ఆమె కళ్ల కద్దుకుంది. జాగ్రత్తగా టేబిలుమీద పెట్టింది. మూర్తివేపు సూటిగా చూస్తూ అడిగింది: "విడాకుల కోసం దరఖాస్తు కాయితమేనా ఇది?"

"అవును." మూర్తి ఆశగా జవాబిచ్చాడు. ఆత్రతగా ఆమె వైపు చూశాడు.

"ఎంతిస్తే మీ అక్కగారు మీ బావగారికి విడాకు




టిస్తారు? చెప్పండి. మీ కెంత కావాలి?"

మూర్తి ఆ మాట విని నిలువెల్లా మండిపోయాడు. "నువ్వు నువ్వు" అంటూ పిడికిళ్ళు బిగించి, ఆవేశంతో కుర్చీలో అటూ ఇటూ ఊగిపోయాడు

జులేఖా నిశ్చలంగా జవాబిచ్చింది. 'నేనా? ఆడదాన్ని!" కొంచెంసేపుండి, మళ్లీ ఆమే మాట్లాడింది "మనిషిని అర్థం చేసుకోవడం కష్టం బంధాన్ని తెగగొట్టడం మరీ కష్టం వెళ్లిరండి."

డ్రాయరుమీద పెట్టిన నోట్ల కట్టను ఆమె అతని ఒళ్లో పడేసింది "ఈ డబ్బు తీసుకువెళ్లి మా అక్కగారికి ఇవ్వండి ఆమెకు నా నమస్కారాలు చెప్పండి వెళ్లండి"

మూర్తి హతాశుడైనట్టు కనిపించాడు విధిలేనట్టు ఆ నోట్లకట్టను జేబులో పెట్టుకున్నాడు కుర్చీలో నుండి లేచి నిలబడ్డాడు

"ఆగండి"

జులేఖా లోపలికి వెళ్లి, అంతలో ఫ్లాస్కుతో తిరిగి వచ్చింది ఫ్లాస్కుమూత తీసి, కాఫీ కప్పులో పోస్తూ అన్నది: "తాగి వెళ్లండి"

మూర్తి మంత్రముగ్ధుడిలా ఆమె చేతిలోనుండి కాఫీ కప్పు అందుకున్నాడు. కాఫీ తాగుతూ "పంచదార ఎక్కువైంది" అన్నాడు

"అవును. ఇస్మాయిల్‌కు అలా ఉంటేనే ఎక్కువ ఇష్టం"

మూర్తి జవాబు చెప్పకుండా ఆమె వైపు కళ్ళు వెడల్పుచేసి చూసి, బయటకు వచ్చేశాడు ఆ చూపులో మెచ్చుకోలుతనమూ, ఆశ్చర్యమూ, కించిత్ దసూయా కనిపించాయి, కోమలాదేవి ఉరఫ్ జులేఖాకు అద్దం ముందు కూచుని మొహానికి మళ్లీ పౌడ రద్దుకోసాగిం దావిడ.

## 3

మత్తుమందు పుచ్చుకొని, స్పృహలేకుండా ఆపరేషను టేబిలుమీద పడిఉన్న రోగి మొహంలా ఉన్నాడు, పడమటి లోయల్లోకి పడిపోతున్న సూర్యుడు. ఆసుపత్రి కొకముూల ఉన్న రక్తాశోకం కింద నుంచుని డాక్టర్ రాఘవకోసం ఎదురు చూస్తున్నాడు మూర్తి. సాయంకాలపు నీరెండ అతని మొహంమీద పడి లోపలి విసుగుదలను విచిత్రంగా బయటకు వ్యక్తీకరిస్తూంది ఆపరేషన్ థియేటర్‌లోంచి కారిడార్ లోకి ఓ నర్సు రావడం చూచి, ఆమె దగ్గిరకు వెళ్లి ఆత్రతగా అడిగాడు: "సూ ప రిం టెం డెం టు గా రు ఎప్పుడొస్తారు బయటకు?"

ఆమె తల వంచుకుని వెళ్లిపోతూనే జవాబు చెప్పింది. "ఆపరేషన్ అయిన తరవాత." మూర్తి ఆమెవేపు కోపంగా చూశాడు. ఆమె అప్పటికే కారిడార్ చివర ఉన్నది. కొద్దిసేపయిన తరవాత ఆమె తిరిగి రావడం చూసి కోపాన్ని తగ్గించుకుని, వీలయినంత సౌమ్యంగా అడిగాడు: "హి ఈజ్ మై బ్రదర్—ఇన్—లా ఆయనతో చాలా అర్జంటుగా మాట్లాడాలి"

"ఐ సీ! ఐతే మా జులేఖా తమ్ముల్లన్న మాట! నో నో! అన్నగారయ్యుండాలి అవునా?"

"జులేఖా! ఆవిడ మీకు బాగా తెలుసా?"

"ఎందుకు తెలీదూ? మొన్నటిదాకా ఆవి డిక్కడ నర్సుగా పనిచేసేది కదా! షి ఈజ్ ఎ నైస్ లేడీ!"

మూర్తి వ్యంగ్యంగా అన్నాడు: "అవునవును. మతం మార్చుకోవడం నైసిటీకి గొప్ప చిహ్నం."

ఆపిలు పళ్లవంటి బుగ్గలను పూరించి, దానిమ్మ గింజల వంటి పళ్లను బైట పెట్టి, మతారంగా నవ్వి, "జస్ట్ ఎ కన్వీనియన్స్" అని, "వస్తా" అని వెళ్లి పోబోయింది.

మూర్తి ఆమెను నఖశిఖపర్యంతం అసహ్యంగా చూశాడు. "వండర్‌ఫుల్ కన్వీనియన్స్! ఇంతకూ ఆయనెప్పుడు వస్తారో చెప్పలేదు."

"ఇప్పుడు రారు. లోపలొక సీరియస్ ఆపరేషన్ జరుగుతూంది. తల్లినీ, బిడ్డనూ కూడా బ్రతికించాలని డాక్టరుగారు మహా తాపత్రయపడుతున్నారు" అంటూ ఆ నర్సు వెళ్లిపోయింది అవతలకు.

"హుఁ. తల్లినీ, బిడ్డనూ బ్రతికిస్తాడు! ఇంట్లో తల్లికీ, బిడ్డలకూ అన్యాయంచేసి, ఇక్కడేం చేస్తాడు?"

దూరంగా ఎవరో అనుకుంటున్న మాటలు అతను వినదలుచుకోకపోయినా, అతని చెవిన పడుతున్నాయి.

"ఏం చెయ్యయ్యా ఆ మహారాజాది! ఆపరేషను గదిలో ఉంటే చాలు ఆ తండ్రి! ఇహ రోగి బ్రతికి బయట పడ్డట్టే!"

మూర్తి అనుకోకుండా బైటికి పెద్దగా అనేశాడు. "ఇంకా చెయ్యి చలవ ఉండదు లెండి."

"ఏం నాయనా, అట్లా అంటున్నావ్?" ఓ ముసలి వాడు భయం భయంగా అడిగాడు.

"కట్టుకున్నదానిని కాదని మరో దానికి సిఖా కట్టాడు. పుట్టిన మతం కాదని, మరో మతం పుచ్చుకున్నాడు."

"ఎందుకు చేశాడో ఆయన ఆ పని. కారణం లేందే ఆ ధర్మరాజు అంత కానిపని చేస్తాడా?"

మూర్తికి ఆయనతో వాదించడం ఇష్టంలేక, అక్కడి నుంచీ వచ్చేశాడు. టాంక్‌బండ్ మీదకు వెళ్లాడు. పురుషుడు స్త్రీత్వానికి బానిస కావడం సర్వేసర్వత్రా అతనికి కనిపిస్తున్నది. సంసారమూ, పిల్లలూ, బాధలూ బంధాలూ—వీటి మధ్య నలిగిపోతున్న మగవాళ్లను చూసి మూర్తి జాలిపడ్డాడు. ఎవరో ఒక కుర్రవాడు ఒంటరిగా కూచుని టాంక్ నీళ్లల్లోకి రాళ్లు విసిరేస్తున్నాడు. అతని పక్కన చేరి, మూర్తి అడిగాడు:

"ఏం బాబూ, ఇక్కడ ఉన్నావ్?"

"మా అమ్మా, నాన్నా సినిమాకెళ్లారు, నన్నింట్లో ఉండమని."

ఆ కుర్రవాడికి కొంచెం దూరంలో ఇద్దరబ్బాయిల మధ్య ఓ అమ్మాయి కూచుని కబుర్లు చెబుతున్నది. అప్పుడే విచ్చిన నూరు వరహాల పువ్వులా ఉన్న దామె. ఆ ఇద్దరబ్బాయిలూ ఒకరివైపు ఒకరు కోపంగా, అసూయగా చూసుకొంటున్నారు. టాంక్‌నీళ్లల్లో విద్యుద్దీపాలు మెరుస్తున్నాయి. అక్కడ ఉన్న మనుష్యుల కళ్లల్లో ఆశలు మెరుస్తున్నాయి. అందంగా అలంకరించుకుని వచ్చిన ఆడవాళ్లు మగవాళ్లను ముక్కుతాడు వేసి నడిపిస్తున్నారు.

మూర్తికి తన చెల్లెలు జ్ఞాపకం వచ్చి, మనసు కలుక్కుమన్నది. గడియారం చూసుకుని, ఉస్సురని నిట్టూర్చి, లేచి నిలబడి, నాలుగడుగులు వేశాడు. ఎదురుగా ఆ సాయంత్రం ఆసుపత్రిలో తాను మాట్లాడిన నర్సు ఒంటరిగా రావడం చూసి, సంభ్రమంతో ఆగిపోయాడు. అతన్ని చూసి గుర్తించినట్లుగా ఆమె సౌమ్యంగా నవ్వింది. టెర్లిన్‌చీర కట్టుకుని, జడలో పువ్వులు తురుముకుని, అలతిగా అలంకరించుకొని వచ్చిన ఆమెను చూసి "సిస్టర్" అంటూ ఆగిపోయాడు మూర్తి.

"నా పేరు కమల" అన్న దామె.

"థాంక్స్. మా బావగారు వెళ్లిపోయారా?"

"లాంగ్ టైమ్ ఎగో."

ఇద్దరూ నడుస్తూనే మాట్లాడుతున్నారు. రోడ్డు మీద పరిగెత్తే కార్ల హెడ్‌లైట్లు వాళ్లమీద పడి వెలుగునీడలను సృష్టిస్తున్నాయి. ఆమె పూసుకున్న లవండరు పరిమళం జడలోని పువ్వుల వాసనను ఓడించలేకపోతున్నది.

"మా బావగారు. . ."

"ఇక్కడకూడా మీ బావగారి గొడవేనా?" ఆమె మందలించినట్లుగా అన్నది.

"ఆ వలపుకత్తెకూ, ఆయనకూ పరిచయం ఎట్లా అయిందోనని?"

"దయచేసి ఆ విషయం మాట్లాడడం మానేద్దురూ!" ఆమె లాలనగా అన్నది. "అబ్బ! కాళ్లు పీకుతున్నాయి. ఒక చోట కూచుందాం" అన్నది. అంటూనే జనం అంతగా లేనిచోటకు దారి తీసింది. ఓ పక్కగా చీరకుచ్చెళ్లను విసనకర్రలా పరుచుకుని కూచుంది. మూర్తి ఆమె పక్కనే చతికిలబడ్డాడు. అతని మౌనాన్ని చూసి ఆమె మళ్లీ అన్నది: "మీ కసలు మాట్లాడ్డం రానట్లుందే. పోనీ, ఓ కథ చెబుతాను, వింటారా?" మూర్తి ఆమె వైపు కుతూహలంగా చూశాడు.

"అనగా, అనగా ఓ నర్సు ఉండేది. ఆమెకు నా అనే వాళ్లు లేరు. ఓ అన్న ఉండేవాడు. ఆమె నర్సు ట్రెయినింగ్ అవుతూండగానే అతనికి సెరిబ్రల్ హెమరేజ్ వచ్చి అకస్మాత్తుగా పోయాడు. పాపం! ఒంటరి పక్షి. రెక్కలా ఇంకా రాలేదు. గూడు అసలే లేదు. ఎందరో తమ గూట్లోకి రమ్మన్నారు. రానన్నది. తన కాళ్లమీద తాను నిలబడతానంది. ఈ ఊళ్లో నర్సు ఉద్యోగం సంపాయించుకొంది. ఇక్కడామెను ఓ పెద్దమనిషి కలిశాడు. ఎంత మంచివాడని! ఎంత అందగాడని! డబ్బుంది. హోదా ఉంది. గుణం ఉంది."

టాంక్‌బండ్‌మీద బస్సులు పరిగెడుతూ, రొద చేస్తూండడం మూలాన, కథనం అతనికి సరిగా వినబడడం లేదు. చెవులొరబెట్టుకుని వింటూ అతను ఆమెకు దగ్గరగా జరిగాడు. ఆమె అతనికి దగ్గరగా జరిగి మాట్లాడుతూంది. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు అతనికి తగులుతున్నాయి. ఆమె చీరచెరగు అతని చెక్కిలంచుతో సయ్యాటలాడుతూంది. ఆమె చెప్పడం సాగించింది.

"అనేసార్లు వాళ్లు వృత్తిరీత్యా కలుసుకున్నారు. పరిచయం పెరిగి, మనసు విప్పి మాట్లాడుకొన్నారు. మనసులు కలిసిన తరవాత ఒకరికొకరు కావాలను కొన్నారు." "ఏ కళ్యంతరమా?" అని అడిగాడు, అతడు మొదట్లో ఆమెను. తరవాత "మీకు భయంగా ఉందా?" అన్న దామె అతనితో. ఆమె తాను నెల తప్పిన సంగతి చెప్పేసరికి విజంగానే అతనికి భయం వేసింది. పెళ్లి చేసుకోమని అడిగింది. అతను తనకు తోచిన


దేహపుష్టికి ఆరోగ్యానికి
పండిత-డి గోపాలాచార్యులవారి
జీవామృతం
69 సంవత్సరములనుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు 17

లాజిన్



పేలు, ఈపి, చుండ్రు నివారిణి.
అన్ని షాపులలో అమ్మబడును
డిస్ట్రిబ్యూటర్లు:—
శ్రీనివాస మెడికల్ & ఫాన్సీ మార్టు
రేపల్లె, గుంటూరు జిల్లా.
11-42-45, రాంగోపాల్ వీధి, విజయవాడ-1
595, పతంగె బిల్డింగ్సు, సిద్దింబజార్,
హైదరాబాద్; 12/62, మెయిన్‌రోడ్డు, వరంగల్.

మొటిమలు మాయమగును
చర్మము మృదువుగా శుభ్రపడును
నిక్సోడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, నాజూకుగాను శుభ్రపడునని గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎర్రని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మపురంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మవ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, నాజూకుగాను శుభ్రము చేయు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

చెప్పాడు."

"ఏమని?" మూర్తి ఆత్రతగా అడిగాడు ఆమె వైపుకు తిరిగి. తెల్లని ఆమె చెంప వెచ్చగా అతనికి తగిలింది అతని ఒళ్లు ఝల్లుమంది.

"మీరైతే ఏమనేవారు?"

"అత నేమన్నాడో చెప్పవ్?" మూర్తి ప్రాధేయపడ్డాడు.

"చేసుకోనన్నాడు. తనకు పెళ్లి అయిందన్నాడు."

"పాపం, ఆవిడేం చేసింది?"

కమల కళ్లవెంబడి కన్నీరు కారుతూంది. "ఏమన లేదు. అతన్ని సుఖంగా బ్రతకమని తను చావాలనుకొంది."

కమల కన్నీరు చూసి మూర్తి జాలితో కరిగిపోయాడు. కర్చీఫ్ తీసి మెల్లిగా ఆమె కన్నీరు తుడుస్తూ, "కమలా! కొంపతీసి ఇది నీ కథ కాదుకదా!" అన్నాడు.

"నా కథే!" అన్న దామె, గొంతులో జీరతో.

మూర్తి తన చేతుల్లోకి ఆమె చేతులను తీసుకున్నాడు. "వద్దు, కమలా! నువ్వు చావద్దు ఎంతో అందమైనదానివి. ఎంతో. . ."

"చనిపోయేదానికి నాకు అందం దేనికి?"

"ఊహూం. నువ్వు చనిపోకూడదు ఒక మగవాడి దౌర్బల్యానికి అన్యాయంగా బలి కాకూడదు."

కమల బలహీనంగా సమాధానం చెప్పింది: "మీకు తెలీదు. భర్తలేని స్త్రీని ఈ సమాజం ఎంత వెలితి చేసి చూస్తుందో మీకు తెలీదు. అందులోనూ, తాళి కట్టినవాడు కనిపించక, తల్లిగా మాత్రమే ఆమె కనిపిస్తే. . ."

"అక్కరలేదు. ఆ లోటు నీ కక్కరలేదు. ఆ తాళి నేను కడతాను. ధైర్యంగా, ఆనందంగా సమాజం ముందు నిలబడు. నిన్ను నవ్వినవాళ్లను చూసి నువ్వు నవ్వు."

మూర్తి ఆవేశాన్ని చూసి ఆమె నవ్వి నవ్వి అలిసిపోయింది. "సరిగా మీ బావగారు అదే పని చేశారు, స్వామీ! చనిపోయే ఒక అబల ప్రాణం కాపాడారు" అన్నది, ఆయాసాన్ని అణచుకుంటూ. ఇంతలోకి అక్కడికొక యువకుడు వచ్చాడు. "హలో, డార్లింగ్! యూఆర్ హియర్. నీ కోసం చూసి చూసి, వెతికి వెతికి కాళ్లు కాయలు కాచాయి" అన్నాడు ఎంతో స్వేచ్ఛగా. అంతలో మూర్తిని చూసి, "వీ రెవరు?" అన్నాడు ఎంతో మర్యాదగా.

"ఓ ఆదర్శవాదిలే!" అంటూ లేచి నిలబడి, మూర్తి వైపు చూసి, "ఇతని కోసమే నే నిక్కడకు వచ్చింది. హి ఈజ్ మై ఉడ్ బి హజ్బెండ్. గుడ్‌బై...చీరియో!" అంటూ వెళ్లిపోయింది.

మూర్తికి ఒక్కసారిగా ప్రపంచం తల్లక్రిందులైనట్లనిపించింది. ఆడది తలుచుకుంటే మగవాణ్ణి ఎట్లా వెర్రివెంగళప్పను చేయగలదో గ్రహించి, "పాపం, రాఘవ ఏం చేయగలడు? ఓ బలహీనమైన క్షణంలో కాలు జారాడు. అనుభవిస్తున్నాడు" అనుకున్నాడు సానుభూతితో. ఇట్లా అనుకున్న మూర్తికి హృదయంలో తెలియని ప్రశాంతత లభించింది. చీకటి చల్లగా తగిలింది. లేచి నిలబడి ఇంటికి వచ్చాడు.

ఇంటికి వస్తూనే, సోఫాలో కూచుని సన్నగా వినవచ్చే రేడియో సంగీతానికి తాళంవేస్తూ, కథలపత్రిక చూస్తున్న రాధను చూడగానే తృప్తిపడి, తరవాత ఆశ్చర్యపోయాడు. వరండాలో ఓ మూలగా పడుకున్న ఆల్సేషియన్ కళ్లు మిటకరించి చూస్తున్నది. మూర్తిని చూస్తూనే, మొహం నిండా సంతోషాన్ని నింపుకుంటూ కుర్చీలోనుండి ఒక్కసారిగా లేచి నిలబడి, అతనికి దగ్గరగా పరిగెత్తుకు వచ్చినట్లుగా వచ్చి, "ఆయ నొచ్చారన్నయ్యా!" అన్నది రాధ

"ఎవరమ్మా?"

"ఆయనే, అన్నయ్యా! మీ బావగారు. పదిహేను రోజులక్రితం నాకు ప్రామిస్ చేసిన నెక్లెస్‌కూడా తీసుకొచ్చారు. ఎట్లా ఉందన్నయ్యా ఈ నెక్లెస్?"

"నెక్లెస్‌కేమమ్మా ఫస్టుగా ఉంది. నీ పద్ధతే నాకేం బాగోలేదు." మూర్తి కుర్చీలో కూలబడ్డాడు. ఆ మాట విని రాధ ఉత్సాహమంతా నీరుగారిపోయింది. "అదేమి టన్నయ్యా అట్లా అంటావ్?"

మూర్తి రాధవేపు జాలిగా చూశాడు. "కాకపోతే ఏమనమంటావ్? నువ్వో పిచ్చిదానివి. కుడుం చేతికిస్తే పండగ నీకు."



సహకారం

ఫోటో — రాజా రామకోటి (మద్రాసు-1)

రాధ అతని అమాయికత్వం చూసి నవ్వింది. "కాక ఏం చేయమంటావ్? వారితో దెబ్బలాడమంటావా? దెబ్బలాడి నేను సాధించే దేముంది?"

"మన ఇంటికి పోదాం, పద."

"ఈ బంధాన్ని తెంచుకునా?"

మూర్తి మాట్లాడలేదు. రాధ చీరకుచ్చెళ్లు నేల మీద పరిచిన తివాచీమీద జీరాడుతుండగా, మెల్లగా నడుస్తూ, గోడ కమర్చిన అద్దం దగ్గిరికి వెళ్లి, చెదిరిన బొట్టును సరిగా దిద్దుకుంది. అద్దంలో తనవైపే ఏకదీక్షగా చూస్తూ కనిపించిన అన్నయ్యను చూసి వెనకకు తిరిగి అన్నది:

"ఈ బంధం ఇంత తొందరగా తెంపితే తేగే బంధం కాదన్నయ్యా! మగవాడొక మహానది. ఆడదొక ఉపనది ఎన్నో ఉపనదులను తనలో కలుపుకుంటున్నాడని మహానదిని కోపించి ప్రయోజనమేమిటి? వీతనైతే దాని మార్గాన్ని మళ్లకుండా చూసుకోవాలిగాని!"

మూర్తికి రాధ తనకు అంతవరకూ తెలియని ఒక కొత్త వ్యక్తిగా భాసించసాగింది. "ఈ ఇల్లు దాటి నేను బయటకు వస్తే ఈ బంధం తెగిపోతుందన్న భ్రాంతి కలుగుతుంది. అటువంటి భ్రాంతిని మాత్రం మనం ఎందుకు కలిగించాలి?"

"కూడదు" అన్నట్లుగా తల ఊపి, మూర్తి కుర్చీలోనుండి లేచి, వాకిలివేపుగా నడవబోయాడు.

"ఎక్కడి కన్నయ్యా వెళ్తున్నావ్?"

"ఈ సమయంలో రాఘవతో ఏం మాట్లాడాలో నాకు తెలీడం లేదు. వాణ్ణి కలుసుకోవడం నాకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఎదురుపడితే, ఏం తొందర పడతానో! అందుకనే వెళ్లిపోతున్నాను."

మల్లెలకన్న, వెన్నెలకన్న, మనసులోని మంచికన్న, మమతాబంధంకన్న తెల్లగా, చల్లగా రాధ నవ్వింది.

"ఆ శ్రమ నీకు లేదులే! ఆయన ఇంట్లో లేరు."

"వచ్చాడన్నావ్?"

"వచ్చి వెళ్లిపోయారు."

"ఎక్కడికి?"

"ఆర్యసమాజం వారి దగ్గిరికి!"

"ఎందుకూ?"

"ఆయనా, చెల్లెలూ మళ్లీ మన మతంలో కలవడానికి!"

మూర్తి ఆశ్చర్యంతో స్తంభించిపోయాడు. దూరంగా పిల్లలు చదువుకొంటున్న శబ్దం. రేడియోలో విరామ సంగీతం. మాలతిమీద నుండి అలలు అలలుగా తేలివస్తూన్న వాసన. మూర్తి చెల్లెలువెంట బంధితుడుగా డైనింగ్‌హాల్‌లోకి నడిచాడు. ★